క్లుప్తంగా

నేడు వాహనాలకు వేలం

ములుగు రూరల్ : ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో పట్టుబడిన వాహనాలకు మంగళవారం ఉదయం 11 గంటలకు వేలం పాట నిర్వహిస్తున్నట్లు ప్రొహిబిషన్ ఎక్సైజ్ సీఐ సుధీర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనదలిచిన వారు ధరావత్తు సొమ్ము 50 శాతం ముందుగా చెల్లించాలని, మిగతా సొమ్మును వాహనం పొందిన తర్వాత చెల్లించాలని అన్నారు. తుక్కు వాహనాలను కటింగ్ చేసి మాత్రమే తీసుకోవాలని సూచించారు. వాహనం పొందిన వారు జీఎస్టీ చెల్లించాలని అన్నారు.

వాహనాల తనిఖీ



వెంకటాపురం(కె) : మండల పరిధిలోని వియాపురికాలనీ సమీపంలోని కొత్తపల్లికి వెళ్లే రహదారి వద్ద స్థానిక ఎస్సై అశోక్ ఆధ్వర్యంలో సీఆర్‌పీఎఫ్ సిబ్బంది, సివిల్ పోలీసులు ముమ్మరంగా వాహన తనిఖీలు చేపట్టారు. చర్ల మండలం నుంచి వెంకటాపురం వచ్చి వెళ్లే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనుమానిత వ్యక్తులు తారసపడితే వారి నుంచి పూర్తి స్థాయి సమాచారాన్ని తీసుకొని పంపిస్తున్నారు.తని ఖీల్లో సివిల్ పోలీసులు, తదితరులు ఉన్నారు.

కలిసికట్టుగా పనులు చేసుకోవాలి



వాజేడు: గ్రామస్తులు కలిసికట్టుగా పనులు చేసుకుని అభివృద్ధి చెందాలని వాజేడు ఎస్సై కొప్పుల తిరుపతిరావు, సీఆర్‌పీఎఫ్ కమాండెంట్ సతీష్ సూచించారు. మండల పరిధిలోని గ్రామంలో సివిల్, సీఆర్‌పీఎఫ్ పోలీసులతో కలిసి కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు గ్రామస్తులతో మాట్లాడుతూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగుండా చూసుకోవాలన్నారు. ఘర్షణలు పడవద్దని ఎవరిపనులను వారు చేసుకోవాలని తెలిపారు.

పరామర్శ



ములుగు రూరల్(గోవిందరావుపేట) : గోవిందరావుపేట మండలం చల్వాయి గ్రామానికి చెందిన గనపాక సారయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా అతని కుటుంబ సభ్యులను ములుగు, భూపాలపల్లి జిల్లాల సబ్ రిజిస్ట్రార్ తస్లీమామహ్మద్ సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా సారయ్య చిత్రపటానికి ఆమె పూలమాల వేసి నివాళులు అర్పించారు. బాధిత కుటుంబానికి సర్వర్ చారిటుబ్ ట్రస్టు నుంచి 50 కిలోల బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు. ఆమె వెంట ట్రస్టు సభ్యులు, తదితరులు ఉన్నారు.

పీఓను కలిసిన ప్రెస్‌క్లబ్ నూతన కమిటీ



ఏటూరునాగారం: మండల ప్రెస్‌క్లబ్ నూతనంగా ఎన్నికైన సభ్యులు సోమవారం ఐటీడీఏ పీఓ అంకిత్‌ను కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు అఫ్జల్‌పాషా, ప్రధాన కార్యదర్శి అలువాల శ్రీనివాస్, ఉపాధ్యక్షులు ఎగ్గడి వెంకటేశ్వర్లు, కుదురుపాక రాజేష్, ఎంపెల్లి లకుమయ్య, గౌరవ అధ్యక్షుడు నూక ప్రభాకర్, తదితరులు పరిచయం చేసుకొని సమస్యలను వివరించారు. అలాగే సీఐ రాజు, ఎస్సై రమేష్‌లను కలుసుకొని మండల సమస్యలను వివరించారు. కార్యక్రమంలో బోడ సత్యం, శేఖర్, పెండ్యాల ప్రభాకర్, వసంత రమేష్, గోవర్ధన్, దామోదర్, కిరణ్, ప్రతాప్, శెరి శ్రీను, గౌరి శంకర్, కందగట్ల శ్రీను, గంగాధర్, సురేష్, సాయి పాల్గొన్నారు.

కబ్జా చేస్తే చర్యలు

మహాముత్తారం: చెరువులను ఎవరైన కబ్జా చేయాలని చూస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ మధవి హెచ్చరించారు. మండల కేంద్రంలోని నేతకానిపల్లె సమీపంలోని జోడెకుంట చెరువు కట్ట సమీపంలో నాలుగు రోజుల క్రితం జేసీబీలతో తవ్వినట్లు గ్రామానికి చెందిన కొంతమంది తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో సోమవారం ఆర్‌ఐ శ్రీనివాస్ జోడెకుంటవద్ద తవ్విన ఆనవాళ్లను పరిశీలించి విచారణ జరిపి పంచనామా నిర్వహించారు. పంచనామా ఆధారంగా పలువురిపై పీఎస్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

'డబుల్' ఇళ్లు త్వరితగతిన పూర్తి చేయాలి

● జేఏసీ చైర్మన్ భిక్షపతిగౌడ్



డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాల వద్ద ధర్నా చేస్తున్న నిరుపేదలు

ములుగు రూరల్: జిల్లాకేంద్రంలో నిర్మిస్తున్న డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేసి నిరుపేదలకు కేటాయించాలని ప్రజాసంఘాల జేఏసీ చైర్మన్ ముంజాల భిక్షపతిగౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని నిరుపేదలతో కలిసి డబుల్‌బెడ్‌రూం నిర్మాణాల వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలీ చేసుకొని జీవనం కొనసాగిస్తున్న నిరుపేదలు ఇంటి అద్దె కట్టలేక నానాతంటాలు పడుతున్నారని అన్నారు. జిల్లా కేంద్రంలో నిర్మిస్తున్న డబుల్‌బెడ్ రూంలు నాలుగేళ్లు గడుస్తున్నా ఇప్పటికీ పూర్తి కాలేదని అన్నారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో నిర్మాణాల్లో జాప్యం జరుగుతుందని ఆరోపించారు. ఉన్నతాధికారులు కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి అన్నారు. కార్యక్రమంలో మహిళలు రత్న, ఝాన్సీ, విజయ, పావని, మంజుల, సునీత, విజయ, సుమలత, శ్యామల, స్రవంతి, తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

ములుగు రూరల్: విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ రాష్ట్రవర్కింగ్ కమిటీ సభ్యుడు అంబాల కిరణ్ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లాకేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్‌తో చెలగాటం ఆడుతుందని అన్నారు. నూతన గురుకులాలను ఏర్పాటు చేసినా భవనాలు లేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. 2018 ఎన్నికల్లో నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చి ఇప్పటికీ నెరవేర్చలేదని అన్నారు. ప్రభుత్వం విద్యారంగం సమస్యలను పరిష్కరించాలని అన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అంబాల కిరణ్

కార్యక్రమంలో నాయకులు చింతకింది సంతోష్, మేర్గు మణికంఠ, శ్రీతన్, మమన్, చందు, కళ్యాణ్, నిర్మల్ , జశ్వంత్, అఖిల్, మనోజ్, సుధీర్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



స్టడీ మెటీరియల్ అందిస్తున్న పూర్వ విద్యార్థులు

వెంకటాపురం(ఎం): మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు 1996–97కు చెందిన పూర్వ విద్యార్థులు ఉచితంగా స్టడీ మెటీరియల్‌ను అందించారు. ప్రతి విద్యార్థికి షూస్, ఎగ్జామ్ ప్యాడ్స్, పెన్నులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జనగాం బాబురావు, ఎస్‌ఎంసీ చైర్మన్ చీకుర్తి రమేష్, పూర్వ విద్యార్థులు పోలోజు రామాచారి, శ్రీనివాస్, కుమార్, రవీందర్, రాజు, అశోక్, లక్ష్మణ్, స్వాతి, నిర్మల, రేణుక, పాల్గొన్నారు.

మానసిక స్థైర్యాన్ని పెంపొందించాలి



మాట్లాడుతున్న మానసిక వైద్య నిపుణులు సాత్విక

ములుగు రూరల్ : విద్యార్థుల్లో పరీక్షల ఒత్తిడి నుంచి దూరం చేసేందుకు మానసిక స్థైర్యం పెంపొందించాలని మానసిక వైద్య నిపుణురాలు డాక్టర్ సాత్విక అన్నారు. సోమవారం తెలంగాణ వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లాకేంద్రంలోని జిల్లా ఆరోగ్యశాఖ కార్యాలయంలో వైద్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల ఒత్తిడి నివృత్తి చేసేందుకు పాఠశాలకు వెళ్లి మానసిక ఆరోగ్య అభివృద్ధికి శిక్ష అందించాలని అన్నారు. ప్రధానోపాధ్యాయుల సహకారంతో వార్షికపరీక్షల సంసిద్ధతపై విద్యార్థులకు శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. విద్యార్థులు శారీరక శ్రమ, సంతులిత ఆహారం తీసుకోవాలని అన్నారు. ఒత్తిడి దూరం చేసేందుకు విద్యార్థులు యోగా చేయాలని అన్నారు. విద్యార్థులు చదువుకునే సమయం, నిద్రించే సమయం నిర్దిష్టంగా ఉండాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి అల్లెం అప్పయ్య, వైద్యాధికారులు పాల్గొన్నారు.

హ్యాండ్ వాష్ సెట్ ప్రారంభం



చిట్యాల: మండల కేంద్రంలోని వెంకట్రావ్‌పల్లి (సీ)లో గల రెండవ అంగన్‌వాడీ కేంద్రలో కేర్ ఇండియా స్వచ్ఛంద సంస్థ యూనిసెఫ్ సహకారంతో హ్యాండ్ వాష్ సెట్‌ను ఏర్పాటు చేశారు. ఈ హ్యాండ్ వాష్ సెట్‌ను కేర్ సంస్థ ప్రతినిధి సదానందం సోమవారం ప్రారంభించి మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలు ఆరోగ్యంగా ఉండాలని ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. వ్యక్తిగత పరిశుభ్రత పెంపొందించేందుకు పిల్లలకు వచ్చే అంటువ్యాధులు, సీజనల్ వ్యాధుల నుంచి రక్షణ కల్పించాలనే ఉద్దేశంతో హ్యాండ్‌వాష్ సెట్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ పుల్ల భాగ్యలక్ష్మి, ఆయా లద్దునూరి కొమురమ్మ, పుల్ల మల్లయ్య, పిల్లలు పాల్గొన్నారు.

జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

వెంకటాపురం(కె): గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని సీఐటీయూ మండల కార్యదర్శి కట్ల నర్సింహాచారి అన్నారు. సోమవారం గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టిన పాదయాత్ర మండల కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కార్మికులకు కనీస వేతన చట్టం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కనీస వేతన చట్టం ప్రకారం నెలకు రూ.15, 600 వేతనం ఇవ్వాలని అన్నారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీడీఓ అద్దూరి బాబుకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ప్రేమకుమారి, రమణ, సమ్మయ్య, పోశాలు, రంజిత్, లక్ష్మణరావు, తాటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

16 నుంచి క్రికెట్ పోటీలు ప్రారంభం



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

వెంకటాపురం(కె) : ఈ నెల 16 నుంచి మండల కేంద్రంలోని కాఫెడ్ క్రీడామైదానంలో కేవీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వెంకటాపురం, వాజేడు మండలాల స్థాయిలో నిర్వహించే క్రికెట్ ట్రోర్నీని విజయవంతం చేయాలని టోర్నీ నిర్వహక కమిటీ చైర్మన్ పసుల సూర్యనారాయణ కోరారు. క్రికెట్ పోటీలకు సంబంధించిన కరపత్రాలను సోమవారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ పోటీల్లో గెలుపొదిన వారికి మొదటి బహుమతి రూ.20,116, ద్వితీయ బహుమతి రూ.15,116, తృతీయ బహుమతి రూ.10,116 నగదుతో పాటుగా షీల్డులను అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పర్శిక సతీష్, భుజంగరావు, బుచ్చయ్య, హనుమంతు, కామేశ్వరావు పాల్గొన్నారు.

శివరాత్రి ఉత్సవాలకు పటిష్ట భద్రత



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న సీఐ, ఎస్సై

గణపురం: కాకతీయుల కళాక్షేత్రం కోటగుళ్లలో ఈ నెల 18న నిర్వహించనున్న శివరాత్రి ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పటిష్టమైన భద్రత చర్యలు చేపడుతామని చిట్యాల సీఐ పులి వెంకట్‌గౌడ్, గణపురం ఎస్సై మ్యాక అభినవ్ అన్నారు. కోటగుళ్ల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో శివరాత్రి సందర్భంగా నిర్వహించే శివపార్వతుల కల్యాణ మహోత్సవ ఆహ్వాన పత్రాలను సోమవారం గణపురం పోలీస్‌స్టేషన్‌లో వారు ఆవిష్కరించి మాట్లాడారు. కోటగుళ్లలో శివరాత్రి సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తారని అన్నారు. ఆలయానికి వచ్చే భక్తుల పార్కింగ్ కోసం ఆలయ సమీపంలో ఇరు వైపుల స్థలాలను ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకుడు నరేష్, ఆలయ పరిరక్షణ కమిటీ గౌరవ అధ్యక్షుడు మామిండ్ల మల్లికార్జున్‌గౌడ్ ఉన్నారు.

ద్విచక్రవాహనం చోరీ

మహదేవపూర్: ద్విచక్రవాహనం చోరీకి గురైన సంఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. మండల కేంద్రానికి చెందిన మాజీ ఉపసర్పంచ్ షాహిన్ ఇంటి వద్ద ద్విచక్ర వాహనాన్ని ఆదివారం రాత్రి పార్కింగ్ చేశాడు. సోమవారం తెల్లవారుజామును లేచి చూసే వరకు ద్విచక్రవాహనం కనిపించలేదు. దీంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపాడు. మండలంలోని దొంగతనాలు ఎక్కువ అయ్యాయని, పోలీస్‌లు రాత్రిపూట పెట్రోలింగ్ చేపట్టాలని కోరారు.

ఆలయంలో శిఖండి పాము

గణపురం: మండలంలోని లక్ష్మారెడ్డిపల్లె గ్రామంలో శ్రీ రామలింగేశ్వర అభయాంజనేయ స్వామి ఆలయంలోని ప్రధానగేటు వద్ద ఆదివారం రాత్రి రెండు తలల శిఖండి పాము కనిపించింది. దీంతో గ్రామస్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి వీక్షించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు, సర్పంచ్ ఒద్దుల విజయఅశోక్ రెడ్డి ఆధ్వర్యంలో పామును పట్టుకొని మోరంచవాగు సమీపంలో వదిలేశారు.

కుటుంబ పాలనకు చరమగీతం పాడాలి

వెంకటాపురం(ఎం): రాష్ట్రంలో కుటుంబపాలన కొనసాగిస్తున్న సీఎం కేసీఆర్ పాలనకు ప్రజలు చరమగీతం పాడాలని బీజేపీ మండలాధ్యక్షుడు భూక్య జవహర్‌లాల్ పిలుపునిచ్చారు. సోమవారం రాత్రి మండలంలోని పాపయ్యపల్లిలో ప్రజాగోస- బీజేపీ భరోసా కార్యక్రమంలో ఆయన ప్రజలనుద్దేశించి మాట్లాడారు. రాష్ట్రంలో నిరంకుశపాలన కొనసాగుతుందని, రైతుల సమస్యలు, ప్రజాసమస్యలు ప్రక్కనబెట్టి బీఆర్‌ఎస్ పేరుతో తెలంగాణ సొమ్మును ఇతర రాష్ట్రాల ప్రజలకు ఎన్నికల పేరుతో ఖర్చు పెడుతున్న కేసీఆర్‌కు ప్రజలు బుద్దిచెప్పాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఇన్‌చార్జ్ బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి, నాయకులు పిల్లలమర్రి శ్రీనివాస్, సిరికొండ బలరాం, ధరంసోతు ప్రేమ్‌సింగ్, నగరపు రమేష్, రవీంద్రాచారి, కొత్త సురెందర్, శ్రీను, గోపాల్, రాజు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

భూపాలపల్లి రూరల్: బీజేపీ బలోపేతానికి కార్యకర్తలు, నాయకులు పాటుపడాలని పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి చందుపట్ల కీర్తిరెడ్డి అన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు విష్ణు ఆధ్వర్యంలో భూపాలపల్లి మండలంలోని గొల్ల బుద్దారం గ్రామంలో సోమవారం ప్రజా గోస–బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కీర్తిరెడ్డి హాజరై మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎరుకల గణపతి, నాయకులు సత్తిరెడ్డి, శివరాత్రి వేణు, దేవేందర్, కొమురయ్య, దారవత్ తిరుపతి, అంబాల శంకర్, లాకవత్ సారయ్య తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న జవహర్‌లాల్

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ



సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఎస్సై శ్రీధర్

మొగుళ్లపల్లి: సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడంతో గ్రామాల్లో నేరాలను నియంత్రించవచ్చునని ఎస్సై శ్రీధర్ అన్నారు. సోమవారం మండలంలోని బంగ్లాపల్లిలో గ్రామస్తుల సహకారంతో ఏర్పాటు చేసుకున్న సీసీ కెమెరాల ప్రారంభోత్సవ కార్యాక్రమానికి ఎస్సై ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం ద్వారా నేరాల సంఖ్య తగ్గుతుందన్నారు. గ్రామాల్లో దొంగతనాలు, దోపిడీలు పోకిరీల ఆటలు సాగవన్నారు. నేరం చేసిన వారిని సులభంగా గుర్తించేందుకు దోహదపడుతాయన్నారు. ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానం అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రజితయువరాజు, పంచాయతీ కార్యదర్శి అనూష, జీపీ పాలకవర్గం, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

ఆకలి తీర్చే అవకాశం రావడం అదృష్టం



కాటారం : మాట్లాడుతున్న పుట్ట మధు

కాటారం: ప్రజల ఆకలి తీర్చే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నట్లు బీఆర్‌ఎస్ మంథని నియోజకవర్గ ఇన్‌చార్జ్, పెద్దపల్లి జెడ్పీచైర్మన్ పుట్ట మధు అన్నారు. మండలంలోని కాటారం ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఐటీ కళాశాల విద్యార్థులకు పుట్ట లింగమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మధ్యాహ్న భోజన వసతి కార్యక్రమాన్ని సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రస్తుత మంథని ఎమ్మెల్యే ఏ ఒక్కరికి సాయం చేసిన దాఖలాలు లేవన్నారు. అనేక పదవులు పొంది ఆస్తులు సంపాదించుకొని అమెరికాలో కూడ బెట్టుకుంటున్నారని ఆరోపించారు. ఆకలి విలువ తెలిసినోళ్లే అన్నం పెడతారని, ఎక్కడ ఆకలి ఉంటుందో అక్కడ పుట్ట లింగమ్మ ట్రస్ట్ సేవలు ఉంటాయన్నారు. ఓట్లు వస్తున్నాయంటే ఎమ్మెల్యే, కాంగ్రెస్ నాయకులు నోట్ల కట్టలతో దిగుతారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తోట జనార్దన్, ఉపాధ్యక్షులు వెంకటేశ్వర్‌రావు, సడవలి, యూత్ అధ్యక్షుడు రామీల్ల కిరణ్, సబ్ డివిజన్ యూత్ అధ్యక్షుడు నాయిని శ్రీనివాస్, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు భూపెల్లి రాజు, మహిళ ప్రధానకార్యదర్శి రత్న సౌజన్యరెడ్డి, సీనియర్ నాయకులు శ్రీలక్ష్మిచౌదరి, స్వప్న, సింగిల్ విండో వైస్ చైర్మన్ దబ్బెట స్వామి, పంతకాని సడవలి, దబ్బపేట రాజేష్, దోలి ఆర్జయ్య, లక్ష్మారెడ్డి, వెంకటస్వామి, శ్రావణ్, రవి, రాజేష్, శ్యామ్, రజనీకుమార్, రాజకర్ తదితరులు పాల్గొన్నారు.

మహదేవపూర్: ప్రభుత్వ కళాశాలల్లో చదివే పేద విద్యార్థులకు పుట్ట లింగమ్మ ట్రస్టు అండగా ఉంటుందని సర్పంచ్ శ్రీపతిబాపు అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి సోమవారం సర్పంచ్ ప్రారంభించి మాట్లాడారు. పుట్ట లింగమ్మ ట్రస్టు ఎందరో నిరుపేదలకు సాయం చేస్తుందన్నారు. అలాగే ఈనెల 20న పుట్టలింగమ్మ ట్రస్టు ఆధ్వర్యంలో మంథనిలో నిర్వహించనున్న మెగాజాబ్‌కు నిరుద్యోగులు హాజరై ఉపాధి పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ సల్మాన్ ఖాన్, బీఆర్‌ఎస్ మండల ఉపాధ్యక్షులు లింగాల రామయ్య, మండల యూత్ అధ్యక్షులు అలీంఖాన్, టౌన్ ప్రెసిడెంట్ రాకేశ్, టౌన్ యూత్ అధ్యక్షుడు రాజశేఖర్, సోషల్ మీడియా కోఆర్డినేటర్ రవీందర్, బీసీ సెల్ మండల అధ్యక్షుడు బాపురావు, సీనియర్ మండల నాయకులు లక్ష్మణ్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

కంటి పరీక్షలు చేయించుకోవాలి



మహదేవపూర్ : కంటివెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ అరుణ

మహదేవపూర్: కంటి వెలుగు శిబిరంలో ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలని జెడ్పీటీసీ గుండాల అరుణ అన్నారు. సూరారం గ్రామంలో అంబట్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంటివెలుగు శిబిరాన్ని జెడ్పీటీసీ సోమవారం ప్రారంభించారు.

మహాముత్తారం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెండవ విడత కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీటీసీ వసంత, సర్పంచ్ రమ్యబాయి అన్నారు. సోమవారం మండలంలోని ప్రేమ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన కంటివెలుగు శిబిరాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. కంటి వెలుగు శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామంలోని 80 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి పలువురికి అద్దాలను పంపిణీ చేశారు.

సాయిబాబా ఆలయ వార్షికోత్సవం



ఆలయ ఆవరణలో హోమం చేస్తున్న భక్తులు

మల్హర్: మండలంలోని ఎడ్లపల్లి గ్రామంలోని షిరిడి సాయిబాబా ఆలయ 11వ వార్షికోత్సవ వేడుకలు సోమవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి, అన్నదానం చేశారు. హారతి, పాలాభిషేకం, హోమం, పంచామృత, నవనీతాభిషేకాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

చిట్యాల: మండలంలోని నైన్‌పాక గ్రామానికి చెందిన కంకణాల రజిత ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి రూ.8000 పంపించగా బీఆర్‌ఎస్ నాయకులు సోమవారం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు దొడ్డె శంకర్, జన్నె యుగేందర్, సర్పంచ్ ఐలయ్య, మండల మహిళా అధ్యక్షురాలు ఈర్ల మల్లక్క, బీసీసెల్ మండల అధ్యక్షుడు కృష్ణయ్య, పుష్పక్క, సమ్మయ్య, రమేష్, జిలానీ, రమేశ్, విజేందర్, రాజయ్య, కుమార్ పాల్గొన్నారు.

చింతల్లపల్లిలో..

మండలంలోని చింతల్లపల్లికి చెందిన కల్వచర్ల మల్లయ్య ఇటీవల మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబానికి స్ఫూర్తి సర్వీసెస్ సొసైటీ ఎన్జీఓ స్వచ్ఛంద సంస్థ చైర్మన్ లయన్ డాక్టర్ ఆకుల రమేశ్ రూ.2 వేలు, 50 కేజీల బియ్యం అందజేశారు. మున్నూరుకాపు సంఘం గౌరవ అధ్యక్షుడు ఆకుల రవీందర్, అధ్యక్షుడు హరీష్, రవీందర్, కోడెల నర్సింహారాములు, పాల్గొన్నారు.